

కొత్త పంతుళ్లు వస్తున్నారు..!

- రేపటి నుంచి పాఠశాలలకు కొత్త టీచర్లు
- ముగిసిన డీఎస్సీ శిక్షణ తరగతులు
- కోరుకున్న చోటే పోస్టింగ్
- లీప్ యాప్‌లోనే పోస్టింగ్ ఉత్తర్వులు
- ఉమ్మడి జిల్లాలో 2627 మంది నియామకం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు కొత్త టీచర్లు రానున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు గత నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఇలాంటి కార్యక్రమం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగలేదని విద్యావేత్తలు, అధికారులు, ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారికి అక్టోబరు 3వ తేదీ నుంచి జిల్లా కేంద్రాల్లో 10వ తేదీ వరకు 8రోజుల పాటు విద్యారంగ విషయాలు, వస్తున్న మార్పులు, సంస్కరణలు, బోధన పద్ధతులు, సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పించారు. ఉపాధ్యాయ సంఘాల కోరిక మేరకు ఎస్‌జీటీ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి నూతన ఉపాధ్యాయులు కోరుకున్న చోట పోస్టింగ్ ఉత్తర్వులను అందజేసే చర్యలు చేపట్టింది. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు సోమవారం విధులకు హాజరుకావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు.

ఏకోపాధ్యాయ విధానానికి స్వస్తి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలకు స్వస్తి పలకనున్నారు. ఆయా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులతో పాఠశాలలు కళకళలాడనున్నాయి. పాఠశాలల విద్యను బలోపేతం చేయడమే దిశగా ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,627 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారు. కొత్త గురువులు పాఠశాలలో చేరితే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్‌లోని పలు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. ఈ ప్రాంతం నుంచే 1,156 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొందడం గమనార్హం. ఉద్యోగాలకు ఎంపికైన వారికి సమీప గ్రామాల్లో పోస్టింగ్ ఇచ్చినట్లయితే ఆయా పాఠశాలలు మరింత బలోపేతమయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.



యువజనోత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొనాలి

- పోస్టరును ఆవిష్కరించిన కలెక్టర్ సిరి



పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.సిరి సూచించారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టరును శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 15 నుంచి 29 ఏళ్లలోపు యువ కళాకారులకు ఈ నెల 22వ తేదీన కర్నూలులోని రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచిన విజేతలను జాతీయ స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. సెట్కూరు సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారిపేర్లు, బందాల పేర్లను Https://bit.ly/knldyf25 ద్వారా నమోదు ద్వారా చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9292207601 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి లాలెప్ప, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శివరాముడు, సెట్కూరు పర్యవేక్షణ అధికారి శ్యాంబాబు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు వేగవంతం



శ్రీశైలం క్షేత్రంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు



ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న శానిటేషన్ సిబ్బంది

శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం మల్లన్న దర్శనార్థం రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేశారు. సుండిపెంట కాలనీ నుంచి శ్రీశైలం వరకు పారిశుధ్య పనులు, రోడ్లకు ఇరువైపులా మట్టి చదును పనులు, హెలిప్యాడ్ వద్ద బారికేడ్ల పనులు జరుగుతున్నాయి. అలాగే ముఖద్వారం నుంచి ఆర్చీలకు రంగులు, క్షేత్రంలో బారికేడ్ల ఏర్పాటు, రోడ్లకు ఇరువైపులా కాంక్రీట్ పనులు, మాడవీధుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆలయ గంగాధర మండపం వద్ద తారు రోడ్డు పనులు, బందోబస్తుకు పందిళ్లు, ఆలయం ప్రధాన ద్వారం నుంచి రాజగోపురం వరకు అందమైన పూల మొక్కలు, ఆలయ లోపల క్యూలైన్లకు రంగులు, స్వామివారి ఆలయ నుంచి అమ్మవారి అలయం వరకు టెన్‌జైల్డ్ ఫ్యాబ్రికేషన్ పందిళ్లు, గోడలకు చిత్రాలు, క్షేత్రంలో పచ్చదనంతో సుందరీకరణ మొక్కలు, అతిథిగృహం వద్ద కార్పెంటర్ వర్క్స్ తదితర పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆయా శాఖల అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.



రహదారి వెంట చెత్తను ఏరుతున్న సిబ్బంది



స్వామివారి ఆలయం చుట్టూ ఫ్యాబ్రిక్ పందిళ్లు

పత్తి ధర పతనం

- క్వింటా గరిష్ఠం రూ.7,499
- దిగాలు చెందుతున్న రైతులు



ఆదోని మార్కెట్‌లో నిల్వ ఉంచిన పత్తి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్లో పత్తి ధర మరింత పతనమైంది. శనివారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,499 ఉన్నాయి. ఐదు రోజుల క్రితం స్వల్పంగా పెరిగిన ధరలు మళ్లీ దిగజారడంపై పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లోపే పత్తి ధర క్వింటానికి రూ. 350 పైగా ధర తగ్గింది. ఎడతెరిపిలేని వర్షాలు తగ్గి ఎండలు కాస్తుండడంతో రైతులు కోతకు వచ్చిన పత్తి మార్కెట్ కమిటీకి విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. ధరలు పతనం కావడంపై రైతులు దిగాలు చెందుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దూది ధరలు తగ్గడంతో ఆ ప్రభావం స్థానిక మార్కెట్ యార్డులో ధరలు తగ్గడానికి కారణమని పత్తి వ్యాపారులు చెబుతున్నారు. 11,889 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,960, మధ్య ధర రూ.7,299, గరిష్ఠ ధర రూ.7,499 పలికింది.

సమన్వయంతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

- ప్రధాని పర్యటనను విజయంతం చేయాలి
- మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్
- 250 సీసీ కెమెరాలు ఏర్పాటు
- ప్రధానమంత్రి ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్
- సభ పరిసరాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్ సిరి
- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు : ఎస్పీ విక్రాంత్


కర్నూలు అర్బన్/ ఓర్వకల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటనను మన కుటుంబంలో జరుగుతున్న ఓ కార్యక్రమంగా భావించి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్ అన్నారు. ఈ నెల 16నఉమ్మడి జిల్లాలో ప్రధాని మోదీ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మండలంలోని నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని కంట్రోల్ రూమ్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రులు బీసీ, టీజీ, ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఐఏఎస్, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే మూడు, నాలుగు రోజులు కష్టపడి పనిచేస్తేనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమన్నారు. సభా ప్రాంగణంలో పార్కింగ్ వద్ద 1, 2 ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. భోజనం పంపిణీలో సమస్యలు తలెత్తకుండా నిర్దేశిత ప్రాంతాల్లో భోజనం ఏర్పాట్లు చేయడం ద్వారా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు. దూర ప్రాంతాల నుంచి సభకు వచ్చే వారికి ఆహార ఏర్పాట్లపై దృష్టి పెట్టాలన్నారు.

మిగతా 6వ పేజీలో

జిల్లా అభివృద్ధికి కృషి

- బాధ్యతలు స్వీకరించిన జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ చెప్పారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీగా పనిచేసి కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పదవి బాధ్యతలు చేపట్టారు. మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి జేసీని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. జేసీని జిల్లా అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.



జేసీగా బాధ్యతలు స్వీకరించిన నూరుల్ ఖమర్

ఈ క్రాప్ బుకింగ్ నమోదుకు
25 వరకు గడువు పొడిగింపు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటల వివరాలను ఈనెల 25వరకు ఈ క్రాప్ బుకింగ్‌లో నమోదు కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. గతంలో అక్టోబరు 10 వరకు రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఈ గడువును 25 వరకు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రాయలసీమ రాష్ట్ర సాధనకు ఉద్యమిద్దాం

- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

7

కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ..!

- శ్రీశైల క్షేత్ర పరిధిలోకి సరస్వతీ ఆలయం
- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయశాఖ

6

ఎన్టీఆర్ వైద్యసేవలు నిలుపుదల

- ఉమ్మడి జిల్లాలో 52 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో సమ్మె



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిచిపోయాయి. కర్నూలు జిల్లాలో 57, నంద్యాల జిల్లాలో 25 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఉన్నాయి. శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. సాధారణ, అత్యవసర సేవలు సైతం అందించడం లేదు. బకాయిలు చెల్లిస్తేనే సేవలు పునరుద్ధరిస్తామని ఆషా ప్రతినిధులు ఖరాఖండిగా చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో 57 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 30 ప్రైవేటు ఆసుపత్రులు సమ్మెలో ఉండగా.. 27 హాస్పిటల్స్ యథావిధిగా పని చేస్తున్నాయి. నంద్యాల జిల్లాలో కూడా 22 నెట్‌వర్క్ హాస్పిటల్స్ సమ్మెలో ఉండగా.. 3 హాస్పిటల్స్ యాక్టివ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు ఉన్నవి చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆ దిశగా చర్యలు లేకపోవడం సమ్మె నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులు తెలిపారు. శనివారం 70 శాతం నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు పూర్తి స్థాయిలో నిలిపివేయగా.. మిగతా చోట్ల అత్యవసర సేవలు అందించారు. సాధారణ చికిత్సలు, పరీక్షలకు వచ్చిన వారిని వెనక్కి పంపించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆరోగ్య మిత్రలను సంప్రదించవచ్చు



డాక్టర్ ఎన్టీఆర్ వైద్య పథకం పరిధిలోని ఉచిత వైద్యసేవలు యథావిధిగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 57 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో 28 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో సేవలు యాక్టివ్‌గా కొనసాగుతున్నాయి. ఇవి కాక కర్నూలు జీజీహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రి, ఆదోని ఎంసీహెచ్, ఏరియా ఆసుపత్రి ఎమ్మిగనూరుతో పాటు పత్తికొండ, కోడుమూరు, ఓర్వకల్లు, ఆలూరు సీహెచ్‌సీలో సేవలు కొనసాగుతున్నాయి. ఇబ్బందులు ఉంటే ఆరోగ్య మిత్రలను గానీ 108ని సంప్రదించాలన్నారు.

- భాస్కర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

తుంగభద్ర తీరం

సాహిత్యం

నవరస భరితం జగదేక సుందరి సామా



కర్నూలు కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్రగల 'చింతామణి' నాటకం ఆంధ్రదేశమంతటా ప్రదర్శించని పల్లెటూరంటూ ఏదీ లేదు. అంతటి ఘనతర ఖ్యాతిగాంచిన ఈ నాటకాన్ని గత ప్రభుత్వం నిషేధించింది. ఒక వర్గానికి చెందిన వారి మనోభావాలు దెబ్బతినే రీతిలో ఈ నాటకంలోని సంభాషణలు ఉన్నాయని ఈ నిషేదానికి కారణం. అయితే చింతామణి ఒక భక్తిరస ప్రాధాన్యతతో కూడిన నాటకం. అయితే ఆ స్థాయిలో నాటకాలు లేవు అనుకున్న తరుణంలో చింతామణి నాటకాన్ని మరపించే రీతిలో నిలిచిన నాటకమే 'జగదేక సుందరి సామా'. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో జరిగిన నాటక పరిషత్తు పోటీల్లో తనదైన సత్తాను చూపిస్తూ ప్రశంసల జల్లులు అందుకుంటోంది. ప్రముఖ దివంగత నంది అవార్డు గ్రహీత, సినీ, నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్, మరో రచయిత కళారత్న, విద్వాన్ పత్తి ఓబులయ్య కలిసి రచించిననాటకం ఇది. ఈ నాటకంలో గద్య, గీత రచనలు కులశేఖర్ చేయగా, మైమరపించే పద్య రచన పత్తి ఓబులయ్య కలం నుంచి జాలువార్చారు. దీని మూల కథను ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ అందించారు. ఈ నాటకం రేడియో రూపకంగానూ జాతీయ స్థాయిలో అనేక బహుమతులు అందుకుంది.

నాటకంలోకి వెళితే...అది 'స్పార్టకస్' బానిసత్వ వ్యవస్థలో ఉన్న కాలం. రాజులు, బానిసలు ఇద్దరే ఉన్న కాలంలో మనిషి రాజు దగ్గర బానిసగా అయినా ఉండాలి లేదా దొంగతనం చేస్తూ పొట్టపోసుకునే స్థితిలోనైనా బతకాలి. కోసల రాజ్యంలో కొంత భాగాన్ని సామాదేవి అనే నాట్యకత్తె (వేశ్య) తన వృత్తిపరంగా బాగా సంపాదిస్తూ, కొంతమంది బానిసలకు రాణిగా కొనసాగుతూ ఉంటుంది. 'ఆశయాన్ని ప్రేమ కోసం ఆహుతి చేసిన ప్రియుడు కలిసిన ప్రయాణమే ఇది ఒక ప్రేమాయణం' అంటూ కథ మొత్తాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యే విధంగా నాటకాన్ని ప్రారంభిస్తారు. మాఘ అనే పేరుగల అందగాడు బానిస వృత్తికి పాల్పడకుండా దొంగతనం చేస్తూ గజదొంగగా మారిపోతాడు. మాఘ.. గంగ అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఒకసారి దొంగతనం చేస్తూ కోసల దేశ రాజు ప్రసేనజిత్తు సైనికులకు దొరికిపోతాడు. అతన్ని బంధించి తీసుకువచ్చే సమయంలో సామారాణి అతన్ని చూస్తుంది. మనసు పడుతుంది. రాజును ప్రసేనజిత్తును ఒప్పించి మాఘను తన బానిసగా కొనుగోలు చేస్తుంది. ప్రసేనజిత్తు సామాదేవి అందానికి ముగ్ధుడై, ఒప్పుకుంటే ఈ దేశానికి రాణిని చేస్తానంటాడు. కానీ ఆమె సున్నితంగా తిరస్కరిస్తుంది. ఇక మాఘను ఉక్కు సంకెళ్లు వేసి, అతనికి కాపలాగా పోతరాజు అనే తన అంతరంగికుడ్ని ఏర్పాటు చేస్తుంది. సామా ప్రేమను మాఘ తిరస్కరిస్తాడు. పోతురాజు అనే బానిస మాఘ మనసు మార్చే ప్రయత్నం చేస్తాడు. అతని వల్ల ఇతర బానిసలు శిక్షించబడకూడదని, సామాదేవిని ప్రేమించమని ఆలోచనలో పడేస్తాడు. దీంతో మాఘ ఒక షరతు పెడుతూ ఆమె ప్రేమను అంగీకరిస్తాడు. దాని ప్రకారం ఇతర బానిసలందరికీ విముక్తి కల్పిస్తాడు. సామాదేవి అందుకు ఒప్పుకొని తనవద్ద నున్న బానిసలందరికీ విముక్తి ప్రసాదిస్తుంది. ఈ క్రమంలో తాను గంగను ప్రేమించానని, ఆమెకు ద్రోహంచేసి నీతో ప్రేమను పంచుకోలేనని, తనను క్షమించమంటూ విషం తాగి మాఘా తనువు చాలిస్తాడు. దీంతో సామాదేవి మనసు చుట్టు అల్లుకున్న చీకట్లు తొలగిపోతాయి. 'మహాత్యాగీ నా కళ్లు తెరిపించావు. శారీరక సుఖానికి అందం ఒక ఆభరణం అనుకున్నా...కానీ నా వృత్తి పాకకూపం అని నాకు తెలియదు...' అంటూ భోరున విలపిస్తుంది. అదే సమయంలో బౌద్ధ బిక్షువు పుణ్ణకుడు సామాదేవికి వాస్తవిక జీవన బోధ చేస్తారు.



- ఎస్. మహమ్మద్ మియా, గజల్ గాయకుడు, కర్నూలు

స్ఫూర్తి

మనోనేత్రమే సాహిత్య క్షేత్రం

- దృష్టిలేకున్నా.. సాహిత్యంలో రాణింపు
- బ్రెయిలీ లిపిలోకి మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'
- అంధ ఉపాధ్యాయుడిగా బోధనలో విద్యార్థులకు దిక్సూచి


ఉపాధ్యాయుడిగా, కవిగా రాణిస్తున్న వెంకట రాజారెడ్డి



ఆయనకు చూపులేదు... అయినా అక్షరాలను తన మనోనేత్రంతో దర్శిస్తారు. వాటికి కవితాత్మక రూపాన్ని ఇచ్చి సాహితీ ప్రియులను అబ్బుర పరుస్తారు. పద్యానికి పరిమళాన్ని అద్ది పండితులనూ మెప్పిస్తారు. కవులంతా నల్లసిరా నింపుకొన్న కలాలతో అక్షరాలు జారువారిస్తే... ఈ కవి వేలి కొసల స్పర్శతో (బ్రెయిలీ లిపితో) అక్షరాలను సృష్టిస్తారు. విధి ఆడిన వింత నాటకంలో బాల్యంలోనే చూపు కోల్పోతే, ఆత్మస్థైర్యంతోనే చదువులో ముందుకు వెళ్లారు. అంధుడిగా జీవితం చీకటి మయమైతే.. కుంగిపోకుండా అక్షరాల దివ్వెలను వెలిగించుకొని ప్రగతి బాటలో సాగిపోయారు. దృష్టిలేకపోయినా ఉపాధ్యాయుడిగా బోధనలో ఆయన వేలాది మంది విద్యార్థుల భవితకు దిక్సూచిగా నిలిచారు. తెలుగు భాషపై మమకారంతో తన మనోనేత్రంలోనే సాహితీ క్షేత్రాన్ని సృష్టించుకున్నారు. మహాకవి శ్రీశ్రీ రాసిన 'మహాప్రస్థానం' పుస్తకాన్ని తోటి అంధులు చదువుకునేలా ముద్రించారు. తెలుగు 'కళ్లం' పేరుతో ఒక సాహితీ సంస్థను స్థాపించి సాహితీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు కర్నూలుకు చెందిన డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి.

● కర్నూలు కల్చరల్, ఆంధ్రజ్యోతి

ప్రకాశం జిల్లా కొమర్రోలు మండలం మాధవపల్లె గ్రామంలోని వ్యవసాయ కుటుంబమైన చిన్నావుల పోలమ్మ, చిన్నావుల పుల్లారెడ్డి దంపతులకు రాజారెడ్డి 1976 మే 1న జన్మించారు. నలుగురు అన్నదమ్ములు, ఒక సోదరిల మధ్య అందరికీ చిన్నవాడిగా పుట్టిన ఆయన గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం ఆరంభమైంది. 1981లో 4వ తరగతిలో ఉండగా... సూర్యబింబాన్ని పూర్తిగా చూడాలన్న కోరికతో తదేక దృష్టితో చూసేవాడు. అలా కొంతకాలం పోయాక కళ్లన్నీ మసకబారుతూ వచ్చాయి. భయంతో పెద్దలకు చెప్పలేదు. కొన్ని నెలలకు దృష్టి బాగా దెబ్బతినడంతో చూపు సమస్యగా మారింది. అది దృష్టిలోపమా, లేక సూర్య కిరణాల ప్రభావమా అని తల్లిదండ్రులు గుర్తించక, రాజారెడ్డి వారికి చెప్పక పోవడం మరికొన్నాళ్లకు చూపు కోల్పోయాడు. విషయం ఆలస్యంగా తెలుసుకుని నేత్రవైద్యులను సంప్రదించినా ఫలితం లభించలేదు. అప్పటి వరకు రంగుల ప్రపంచాన్ని చూసిన రాజారెడ్డి బాల్యమే అంధత్వంలోకి జారిపోయింది.





అవార్డులు, రివార్డులు ఎన్నో

- 1996లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంగనాథమిశ్రా చేత ప్రశంసాపత్రం అందుకున్నారు.
- 2000లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ వర్మచేత బహుమతి పొందారు.
- 2001లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏఎస్ ఆనంద్‌చే బహుమతి అందుకున్నారు.
- 2003లో నాటి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్ఎస్ బర్నాలా చేతుల మీదుగా ఎంఏలో గోల్డ్ మెడల్.
- 2018లో నాటి కలెక్టర్ ఎస్.సత్యనారాయణ చేత జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

చీకటి జీవితంలో అక్షర జ్యోతులు

బాల్యంలోనే సంభవించిన అంధత్వంతో కుంగిపోతున్న రాజారెడ్డికి అదే గ్రామానికి చెందిన ఎం.వెంకటరెడ్డి అనే అధ్యాపకుడు భుజం తట్టి మనోధైర్యాన్ని నింపాడు. ఆయన కడప అంధుల పాఠశాల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, పదోన్నతిపై జూనియర్ లెక్చరల్‌గా అప్పుడే పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. ఆయనే రాజారెడ్డి జీవితానికి దిశానిర్దేశం చేశాడు. ఆయన సలహా, సూచనల మేరకు 1982లో కడపలోని రీజనల్ ప్రభుత్వ అంధుల రెసిడెన్షియల్ పాఠశాలలో తిరిగి ఒకటో తరగతిలో చేరాడు. అప్పటి వరకు అక్షరాలు రాసిన చేతి వేళ్లు...బ్రెయిలీ లిపిలో అక్షరాలను స్పర్శిస్తూ చదువు నేర్చుకోవాల్సి వచ్చింది. అక్కడి హెచ్ఎం ఎన్.శ్రీనివాస్, తెలుగు ఉపాధ్యాయుడు గంగయ్య ప్రోత్సాహంతో పాటూ అక్కడి డిప్యూటీ డీఈవో రమణయ్య ప్రోత్సాహంతో తెలుగు భాషపై రాజారెడ్డి మమకారం పెంచుకున్నారు. 1993లో స్కూల్ టాపర్‌గా 430 మార్కులతో పది ఉత్తీర్ణుడయ్యాడు. 1993-95లో తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో 654 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచారు. 1995-98 తిరుపతి ఆర్ట్స్ కళాశాల్లో క్లాస్ ఫస్టుగా నిలిచాడు. 1998-99లో కడప జిల్లా బద్వేలిలోని బిజివేముల వీరారెడ్డి బీఎడ్ కళాశాల నుంచీ బీఎడ్ ప్రథమ శ్రేణిలో పాసయ్యాడు. 1999-2001లో తిరుపతి ఎస్వీయూ నుంచి ఎంఏ (తెలుగు) పూర్తి చేశారు.

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం

డీఎస్సీ ద్వారా 2001లో ఉపాధ్యాయుడుగా ఎంపికైన రాజారెడ్డి 2002 జనవరి 19న ఆలూరు మండలం అరికెర ఎంపీయూపీ పాఠశాల్లో చేరారు. 2004లో పదోన్నతిపై స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా కోడుమూరు జడ్పీహెచ్ఎస్‌లో పనిచేశారు. 2004 ఆగస్టు 28న కోడుమూరుకు చెందిన రామకృష్ణారెడ్డి, సుశీలమ్మ దంపతుల కుమార్తె గాయత్రితో రాజారెడ్డి వివాహం జరిగింది. తెలుగు భాషపై ఉన్న మమకారం, ఆసక్తితో అంధులు చదువుకునేలా బ్రెయిలీ లిపిలోకి మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం' పుస్తకాన్ని అనువదించారు. 2006లో నాటి డిప్యూటీ డీఈవో దేవదాస్, ఎంఈవో నాగరత్నంశెట్టి దీన్ని ఆవిష్కరించారు. 2008-12 మధ్య కాలంలో 'డాక్టర్ జక్కంపూడి మునిరత్నం-వచన కవిత్వం' అనే అంశంపై పరిశోధన గ్రంథం, ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు పర్యవేక్షణలో పూర్తిచేసి, డాక్టరేట్ పొందారు. 2012లో బదిలీపై దిన్నెదేవరపాడు జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తూ హెచ్ఎంగా పదోన్నతిపై నందవరం మండలం టి.సోమశిలలోని జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్నారు.

తెలుగు కళ్లం సాహిత్య సంస్థ ద్వారా సేవలు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న వెంకట రాజారెడ్డి

2019లో తెలుగు కళ్లం పేరుతో స్వయంగా ఒక సాహిత్య సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా సభలు, సమావేశాలు, ఇష్టాగోష్ఠలు, సదస్సులు ఏర్పాటు చేసి మంచి సాహిత్యాన్ని సమాజానికి అందించే దిశగా కృషి చేస్తున్నారు. అలాగే అనేక రేడియో ప్రసంగాలు చేశారు. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, భార్య గాయత్రిల సహకారంతో, వారితో తన భావాలను తెలియజేస్తూ పుస్తకాలు రాస్తున్నారు. 2019లో తెలుగుధీర శతకం, 2021లో విమల దివ్యనామ వేంకటేశ (ద్విశతి), 2024లో శ్రీకాంత శతకం రాశారు. మరో పది అముద్రిత పుస్తకాలు త్వరలో వెలుగు చూడనున్నాయి.

సమన్వయంతో ముందుకు సాగాలి



సమావేశానికి హాజరైన అధికారులు

(5వ పేజీ తరువాయి)

ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఏ వాహనం ఎక్కడికి వెళ్లాలనే విషయంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. టోల్‌గేట్స్ వల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఒకరోజు పాటు టోల్‌ఫీజు లేకుండా ఉచితంగా ఓపెన్ చేయాలని సూచించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు సాధారణ ప్రజానీకం కూడా వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శ్రీశైలంలో స్వామి వారి దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం మధ్యాహ్నం కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో ప్రధాని పాల్గొంటారన్నారు. సభకు 3 లక్షల మంది ప్రజలు రానుందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటుచేయాలన్నారు. సెక్యూరిటీ పరంగా 250 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామన్నారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ ప్రధానమంత్రి పర్యటన పనులు పకడ్బందీగా జరగాలన్నారు. పార్కింగ్ ఏరియాలో ఫుడ్ కౌంటర్, మెడికల్ టీమ్, సౌండ్ సిస్టమ్, సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ నెంబరుతో సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేందర్‌ను ఆదేశించారు. ప్రతి ఏరియాలో శానిటేషన్ సిబ్బంది ఏర్పాటు చేసి ప్రతి ఏరియా పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రేపటి నుంచి సభాప్రాంగణం ఎస్పీజీ వారి ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. ఎస్పీజీ సెక్యూరిటీకి సహకరించాలన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రధాని పర్యటన విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అధికారులు, టీడీపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, మీడియా కో.ఆర్డినేటర్ బి.వెంకటరాముడు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై వీరపాండియన్‌తో మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కలెక్టర్ సిరి



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

● నన్నూరు టోల్‌గేటు వద్ద ప్రధానమంత్రి మత్స్య సంపద వయోజన పథకం కింద చేపల విలువ ఆధారిత యూనిట్‌లో భాగంగా ఏర్పాటుచేసిన వైట్ ఇన్ రెస్టారెంటును మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు.

రంగస్థల లక్ష్మయ్య

- పౌరాణిక నాటకాల్లో రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- ఎన్నో అవార్డులు ఆయన సొంతం

కళ




చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పద్యం ఆయన ప్రాణం.. తరగతి గదిలోనైనా, రంగస్థలంపై అయినా గొంతెత్తి పద్యం పాడితే ఎవరైనా సరే ఫిదా కావాల్సిందే. ఉపాధ్యాయ వృత్తిలోనూ, రంగస్థల ప్రవృత్తిలోనూ తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకున్నారు చాగలమర్రికి చెందిన విడమకంటి లక్ష్మయ్య. చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మయ్యకు చిన్న నాటి నుంచే రంగస్థలంపై మమకారం ఎక్కువ. అవకాశం వచ్చినప్పుడల్లా రంగస్థలంపై ప్రదర్శనలు ఇచ్చేవారు. 2002 జనవరి 21న ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెలో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. పిల్లలకు పాఠం చెబుతూనే పౌరాణిక నాటకాల్లో నటిస్తూ అందరిని ఆకట్టుకున్నారు. చాగలమర్రి తదితర ప్రాంతాల్లో వివిధ వేషాలతో కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఉత్తేజపరిచారు. శ్రీకృష్ణుడు, అర్జునుడి పాత్రలు పోషించారు. గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు వంటి పాత్రలు పోషించడంతో పలువురి మన్ననలు చూరగొన్నారు. వందల సంఖ్యలో పౌరాణిక ప్రదర్శనలు నిర్వహించి ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారు.

● 2025 సెప్టెంబరు 5న సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నుంచి అందుకున్నారు.

● 1995లో సీఎం చంద్రబాబు ప్రభుత్వంలో పొదుపు సంఘాల ప్రచారంలో నాటకాలు వేస్తూ ప్రతి గ్రామంలో అవగాహన కల్పించారు. స్త్రీపాత్ర వేషధారణలో ఆయనకు ఉత్తమ పురస్కారం దక్కింది.

● 2010లో ఆలిండియా రేడియో ప్రసారంలో పాల్గొని పౌరాణిక నాటకాలు, వివిధ పాత్రలు ప్రదర్శించారు.

సంప్రదాయాలను ఆదరించాలి



అంతరించిపోతున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు కళల పట్ల ఆసక్తిని రేకెత్తించాలి. వాటిలో ప్రవేశం కల్పించి ప్రోత్సహించాలి. పాఠశాలల్లో సంగీత, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తే విద్యార్థులు సన్మార్గంలో ఎదుగుతారు.

● లక్ష్మయ్య, తెలుగు పండిట్, చాగలమర్రి



ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మయ్య



సంక్రాంతి సంబరాల్లో హరిదాసు వేషధారణలో లక్ష్మయ్య

నల్లమలలో కూంబింగ్



కూంబింగ్ చేపడుతున్న గ్రేహౌండ్స్ బలగాలు

శ్రీశైలం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని శ్రీశైలానికి వస్తున్న నేపథ్యంలో నల్లమల అడవిలో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు రానున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. పీఎం భద్రతకు సంబంధించిన ముఖ్య అధికారి ఆకె రవి కృష్ణ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష కూడా చేశారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, శ్రీశైలం వన్‌టౌన్ సీఐ ప్రసాద రావు, టూటౌన్ సీఐ చంద్రబాబు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.



సోదాలు చేస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు

కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ..!

- శ్రీశైల క్షేత్ర పరిధిలోకి సరస్వతీ ఆలయం
- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయశాఖ



కొలనుభారతి క్షేత్రం



ఆత్మకూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రానికి మహర్దశ రానుంది. సరస్వతీ అమ్మవారు కొలువైన కొలనుభారతి ఆలయాన్ని శ్రీశైల క్షేత్ర పరిధిలోకి చేర్చి అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైలం దత్తత క్షేత్రంగా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. దీంతో ప్రభుత్వం కూడా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి మండల పరిధిలోని నల్లమల అడవుల్లో 11వ శతాబ్దానికి ముందే కొలనుభారతి క్షేత్రం ఆవిర్భవించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. 11 శతాబ్దంలో రెండవ చాలుక్యులరాజుల కాలం నాటికి చెందిన మల్లభూపతిరాజు శిథిలావస్థకు చేరిన అమ్మవారి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి వెలుగులోకి తీసుకొచ్చినట్లు ఇక్కడి ఆలయ చరిత్ర చెబుతోంది. జగద్గురు ఆది శంకరాచార్యుల వారు విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబదేవి, కొలనుభారతి క్షేత్రంలోని జ్ఞానసరస్వతీ అమ్మవారుల మూటవిరాట్ ఎదుట శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించినట్లు ఆలయ శాస్త్రాల ఆధారంగా తెలుస్తోంది. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రాన్ని ఏవిధంగానైనా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గట్టి ప్రయత్నాలు చేశారు. శ్రీశైలం పరిధిలోకి కొలనుభారతి క్షేత్రాన్ని చేరిస్తేనే అభివృద్ధి సాధ్యమని భావించిన ఆయన కొలనుభారతి క్షేత్ర ప్రాశస్త్యం గురించి, ప్రస్తుత పరిస్థితుల గురించి ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రస్తావించారు.

క్షేత్రాభివృద్ధికి అవకాశం

కొలనుభారతి క్షేత్రాన్ని శ్రీశైల క్షేత్ర పరిధిలోకి చేర్చడం వల్ల క్షేత్రాభివృద్ధి మరింత మెరుగుపడే అవకాశం ఉంది. వాస్తవానికి ఇప్పటికీ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ పనులు పూర్తి కాలేదు. క్షేత్రానికి చేరుకునేందుకు శివపురం చెంచుగూడేం నుంచి కొలనుభారతి వరకు మట్టిరోడ్డే శరణ్యమైంది. వర్షం కురిస్తే.. ఈ రోడ్డు అధ్వానంగా మారుతోంది. క్షేత్రంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే చారుఘోషిణీ నది మురికికుంటగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే అక్కడే సరైన వాహనాల పార్కింగ్ లేకపోవడంతో ప్రతిఏటా వసంతి పంచమి వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ కూడా సక్రమంగా జరగడం లేదు. ప్రత్యేకించి దేవస్థానానికి స్థలం కొరత ఉండటంతో ప్రస్తుతం అటవీశాఖ భూభాగంలోనే కొన్ని కార్యకలాపాలు చేయాల్సిన పరిస్థితి. శ్రీశైల క్షేత్ర పరిధిలోకి కొలను భారతి క్షేత్రం చేరడం వల్ల నిధుల వినియోగం జరిగి ఆయా వసతులు మెరుగుపడే అవకాశం ఉంది.

పూర్వజన్మ సుకృతం



శ్రీశైల క్షేత్ర పరిధిలోకి కొలను భారతి ఆలయాన్ని తీసుకు రావడం నా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఈఅవకాశం సరస్వతి అమ్మవారు తనకి కల్పించిన గొప్పవరం. భవిష్యత్తులో కొలనుభారతి క్షేత్రం కూడా బాసర తరహాలో అభివృద్ధి చెందుతుంది. భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తాం. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ క్షేత్రానికి భక్తులు తరలి వస్తారు. ఇందుకు సహకరించిన సీఎం చంద్రబాబు, దేవదాయ శాఖ మంత్రికి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు.

● గిత్తా జయసూర్య, ఎమ్మెల్యే, నందికొట్కూరు

హోసూరులో రేషన్‌బియ్యం పట్టివేత

పత్తికొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలంలోని హోసూరు గ్రామంలో ఓ మహిళ అక్రమంగా ఇంటిలో దాచిన రేషన్‌బియ్యంను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్‌చేశారు. గ్రామానికి చెందిన అరుణారెడ్డి అనే మహిళ ఓ ఇంటిలో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ చేసిందన్న సమాచారం మేరకు వీఆర్వో బాషా, పోలీసులతో కలసి గ్రామానికి వెళ్లారు. ఇంటికి ఉన్న తాళాలను ధ్వంసం చేసి అక్కడ ఉన్న పది బస్తాల రేషన్‌బియ్యంను సీజ్‌చేశారు. కాగా అక్టోబరు ఒకటో తేదీ తహసీల్దార్ హుసేన్‌సాబ్ సిబ్బందితో కలసి అరుణారెడ్డి ఇంటిపై దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 21.5 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. మళ్లీ అదే మహిళ ఇంటిపై పోలీసులు దాడులు చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎన్నిసార్లు హెచ్చరించినా ఆమె వ్యవహారంలో మార్పు రాకపోవడంతో పీడీ యాక్టు నమోదు చేసేందుకు రెవెన్యూశాఖ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

రాయలసీమ రాష్ట్ర సాధనకు ఉద్యమిద్దాం

● రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 2029 కల్లా ప్రత్యేక రాయలసీమ సాధించుకోవడానికి ఉద్యమిద్దామని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. చాగలమర్రిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 88 ఏళ్లైనా శ్రీబాగ్ ఒప్పందం అమలు పరచకుండా రాయలసీమకు జరిగిన అన్యాయానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. 1937 నవంబరు 16న ఒక ఒప్పందం కుదిరిందని, 8 దశాబ్దాలలో ఒక్క అంశం కూడా అమలు కాలేదని అన్నారు. కర్నూలు రాజధాని మూడేళ్ల ముచ్చటగానే మిగిలిపోయిందన్నారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడేసరికి రాజధానిని కాస్త హైదరాబాదుకు తరలించారన్నారు. రాయలసీమ వాసులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. రాయలసీమ సమస్యల గురించి, ప్రాజెక్టుల గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. రాయలసీమ భవిష్యత్తు గురించి పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రీబాగ్ ఒప్పందం అమలు పరచని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా వచ్చేనెల 16న కర్నూలులోని అంబేద్కర్ భవన్‌లో జరిగే సభకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు ఖాదర్‌వలి, ఖాసీం, సత్యనారాయణమూర్తి, కార్తీకేయరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎద్దులు బెదిరి పరుగులు

● బాలుడిని తొక్కడంతో మృతి



బీరప్ప (ఫైల్)

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ దేవర నాగప్ప, వీరేషమ్మ దంపతుల ఒక్కగానొక్క కొడుకు బీరప్ప(5) ఎద్దుల దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. వివరాలివీ.. ఐదేళ్ల బాలుడు బీరప్ప తన పెద్దనాన్న తరసాలప్పతో కలిసి పొలానికి వెళ్దామని మారెమ్మ దేవాలయం ముందు కూర్చున్నారు. అదే గ్రామానికి చెందిన ఖాజాకు చెందిన ఎద్దుల బండిని ఆయన బావ అయిన షేక్షావలి పొలానికి వెళ్తుండగా మారెమ్మ గుడి దగ్గరికి వచ్చేసరికి ఎద్దులు బెదిరి చిన్నారి బీరప్పను తొక్కాయి. తీవ్రంగా గాయపడ్డ బీరప్పను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకును ఉన్నత చదువు చదివించాలని తల్లిదండ్రులు తలిస్తే మృత్యువు ఎద్దుల రూపంలో కబళించింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నాడు. రెండో శనివారం సెలవు దినం కావటంతో ఇంటి వద్దే ఉన్నాడు.

ఎమ్మిగనూరులో భారీ చోరీ

● 12 తులాల బంగారు, కిలో వెండి,
● రూ.70వేల నగదు అపహరణ



పట్టణంలోని తేరుబజార్ ప్రాంతంలో ఇంట్లో చోరీకి పాల్పడిన దృశ్యం

ఎమ్మిగనూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారు ప్రాంతంలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. తేరుబజారులోని ఆటో మెకానిక్ యూసుఫ్ తన భార్య అనారోగ్యంతో ఉండటంతో చికిత్స నిమిత్తం ఆదోనికి వెళ్లి శనివారం వచ్చాడు. అప్పటికే దొంగలు ఇంటిపై నుంచి లోపలికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. బీరువాను తెరిచి అందులో ఉన్న 12 తులాల బంగారు నగలు, ఒక కిలో వెండి, రూ.70వేల నగదును దోచుకెళ్లారు. దొంగతనం అనంతరం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు బీరువాతో పాటు ఇతర ప్రాంతాల్లో కారంపొడి చల్లివెళ్లారు. ఆదోని నుంచి ఇంటికి వచ్చిన బాధితుడు యూసుఫ్ చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. కాగా ఇటీవలే పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో చోరీ సంఘటనను మరువక ముందే మరో చోట దొంగలు భారీ చోరీకి పాల్పడటంతో పట్టణ వాసులు భయాందోళనలకు గురవుతున్నారు.

పోక్సో కేసు నమోదు : నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఖాజాబాషా అనే నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక కల్లావీధికి చెందిన ఖాజాబాషా ఈ నెల 9వ తేదీన తన ఇంటి సమీపంలో ఉండే బాలికను చాక్లెట్ ఆశ చూపి బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. ఆ తర్వాత నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆ బాలికపై అఘాయిత్యానికి పాల్పడపోగా.. బాలిక కేకలు వేసింది. దీంతో స్థానికులు గర్తించి ఖాజాబాషాను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత తల్లిదండ్రులు తమ కూతురు కనిపించకపోయేసరికి వెతుకుంటూ వెళ్లగా.. స్థానికుల సాయంతో ఆ బాలికను గుర్తించారు. శనివారం ఆ బాలిక చెప్పిన విషయాలతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసును నమోదు చేసి ఖాజా బాషాను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. గతంలో కూడా ఖాజాబాషా 2020లో జరిగిన ఓ కేసులో కూడా ముద్దాయిగా ఉన్నారు. గతంలో కూడా ఓ బాలికపై ఇదే విధంగా అనుచితంగా ప్రవర్తించాడని పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ కౌలు రైతుల మృతి

● కోడుమూరు మండలంలో ఒకరు.. నంద్యాలలో మరొకరు..





శేఖర్, సుబ్బరాయుడు (ఫైల్)

కోడుమూరు రూరల్/నంద్యాల టౌన్, అక్టోబరు 11, (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన రైతులు చికిత్స పొందుతూ మృతి చెందారు. కోడుమూరు మండలంలోని గోరంట్లలో ఒకరు, నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామంలో ఒకరు మృతి చెందారు.

వివరాలివీ.. కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన గుమ్మిశెట్టి శేఖర్ (50) మూడేళ్ల నుంచి 6 ఎకరాలు కౌలు తీసుకుని పంటలు సాగుచేస్తున్నారు. ఉల్లి, పత్తి వంటి పంటల సాగులో తీవ్రనష్టాలు చవిచూశారు. పంటలసాగులో కౌలు, పెట్టుబడుల కోసం చేసిన అప్పులు రూ. 10 లక్షలు పెరిగిపోయాయి. దీంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం గ్రామశివారులో పురుగుమందు తాగారు. అటుగా వస్తున్న కొందరు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హుటాహుటిన అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. శేఖర్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

●నంద్యాల మండలంలోని చాపిరేవుల గ్రామానికి చెందిన కౌలు రైతు గొల్ల సుబ్బరాయుడు (65) 25 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు మిరప పంట సాగు చేశారు. దీంతో ఇప్పటి దాకా సాగు కోసం చేసిన అప్పు సుమారు రూ.75 లక్షలు అయింది. అప్పు చెల్లించే మార్గం లేక మనస్తాపంతో ఈనెల 8న పురుగుల మందు తాగారు. అయితే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. సుబ్బరాయుడుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కీళ్లు.. కన్నీళ్లు



● కాలు కదిపినా భరించలేని నొప్పి
● యువతనూ వేధిస్తోన్న ఆర్థరైటిస్ సమస్య
● ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
● గుర్తించిన వెంటనే చికిత్స తీసుకుంటే ఉపశమనం
● అందుబాటులో ఆధునిక వైద్యం
● నేడు వరల్డ్ ఆర్థరైటిస్ డే

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నీ సక్రమంగా ఉంటేనే పనులు చేసుకోవడానికి అవస్థలు పడుతుంటాం. అలాంటిది ఆర్థరైటిస్ వస్తే కదలడమే కష్టం. కాలు కదిపినా కన్నీళ్లు వస్తాయి. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారికి ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు) వచ్చేవి. ప్రస్తుతం 25 ఏళ్లు పైబడి వారిలో 15 శాతం ఈ వ్యాధితో బాధపడుతున్నారు. 1990లో ప్రపంచ వ్యాప్తంగా 25.6 కోట్ల నాటికి ఈ సంఖ్య 58.5 కోట్లకు చేరింది. 2050కల్లా ఈ సంఖ్య 100 కోట్లకు పెరగవచ్చునని అంటారు. ఓ వైపు కీళ్లకు పోషణ తక్కువ కావడం, మరో వైపు అధిక బరువు, స్థూలకాయం వల్ల కీళ్లపై ఒత్తిడి పెరగడం వల్ల ఆ కీళ్ల వ్యాధులు పెరుగుతున్నాయి. ఒకప్పుడు 60 ఏళ్లపై బడిన వారికి వచ్చే ఆర్థరైటిస్ నేడు యువతను సైతం పట్టి పీడిస్తున్నాయి. ప్రాథమిక దశలో ప్రాథమిక దశలో కీళ్ల వ్యాధులను గుర్తించి వైద్యులను సంప్రదిస్తే వ్యాధిని నయం చేయవచ్చు. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ 1996 నుంచి ప్రతి ఏటా అక్టోబరు 12న వరల్డ్ ఆర్థరైటిస్ డే నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాది మీ కలలను సాకారం చేసుకోవడం, రుమాటిక్ మాస్క్యులోస్కెలెటర్ వ్యాధులతో (ఆర్ఎండీ) జీవిస్తున్న వ్యక్తులు వారి సామర్థ్యాన్ని గ్రహించడానికి ముందుకు సాగాలన్నది ఈ థీమ్ ఉద్దేశ్యం.

కర్నూలు జీజీహెచ్‌కు బాధితుల క్యూ

ఉమ్మడి జిల్లాలో కీళ్ల వ్యాధిగ్రస్థులు ఏటా పెరుగుతూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభాగానికి ప్రతి రోజు 300 నుంచి 400 మంది దాకా ఓపీకి రోగులు వస్తుంటారు. ఇందులో 80 మంది ఆర్థరైటిస్ వ్యాధిగ్రస్థులే ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఇదే పరిస్థితి. ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలుతుండడం, డెంగీ బాధిస్తుండడంతో వీరిలో ఎక్కువ మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ఇదిలా ఉంటే కృత్రిమ కీళ్ల మార్పిడిలో ఉమ్మడి జిల్లాలో పలు ప్రైవేటు ఆసుపత్రులు గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ విభాగంలో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహిస్తున్నారు. అయితే ఇంప్లాంట్ మాత్రం రోగులపై భారం పడుతుంది. దీంతో ఇంప్లాంట్ కొనలేని పేద రోగులు వెనుదిరుగుతున్నారు.

అందుబాటులో ఆధునిక వైద్యం

కీళ్ల అరుగుదల వల్ల వచ్చే కీళ్ల వాపు వ్యాధులకు ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. నాలుగు దశలో ఈ వ్యాధికి చికిత్సలు అందిస్తున్నారు. మొదటి దశలో వైద్యుడిని సంప్రదించి పెయిన్ కిల్లర్స్ వాడటం, ఫిజియోథెరపీ చేయించుకోవడం. రెండో దశలో కీళ్లలో జిగురు కోసం మందులు వాడటం, మూడో దశలో లోపల జాయింట్‌లు శుభ్రపరచడం జరుగుతుంది. నాలుగో స్టేజీలో కీళ్ల మార్పిడి (టోటల్ జాయింట్ రీప్లేస్‌మెంటు) ఆపరేషన్ ద్వారా ఆర్థోరైటిస్ వ్యాధిని నయం చేయవచ్చు.

తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స



ఆర్థరైటిస్ వ్యాధిని తొలిదశలోనే గుర్తించాలి. అప్పుడే సమర్థమైన చికిత్స అందించవచ్చు. ఆర్థరైటిస్ లక్షణాలు అందరిలోనూ ఒకేలా ఉండవు. ఇది కొద్దిపాటి తీవ్రత నుంచి తీవ్రమైన లక్షణాల వరకు ఉండవచ్చు. ఏళ్ల తరబడి కనిపించడంతో పాటు కాలం గడిచే కొద్ది తీవ్రత పెరగవచ్చు. తొలిదశలో ఆకలి తగ్గడం, జ్వరం, బాగా నీరసించిపోవడం వంటివి కనిపిస్తాయి. ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ పరీక్షలతో పాటు కొన్ని రకాల అడ్వాన్స్‌డ్ పరీక్ష సహాయంతో వ్యాధి నిర్ధారణ జరుగుతుంది. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఒకదశలో శరీర వైకల్యాలు రావచ్చు.

● డా.ఎ.సృజన, రుమటాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఓపీకి 70 నుంచి 80 మంది రోగులు



ఆర్థోపెడిక్ విభాగానికి రోజుకు 300 నుంచి 400లకు పైగా రోగులు వస్తుంటారు. ఇందులో కాళ్లు వంకరపోవడం, నడుస్తున్నప్పుడు మోకాల్లో శబ్దం రావడం, మెట్లు ఎక్కలేకపోవడం, కింద కూర్చోలేకపోవడం వంటి లక్షణాలతో ఆర్థరైటిస్‌తో బాధపడుతూ 70 నుంచి 80 మంది వస్తుంటారు. ఇలాంటి వారు వ్యాధిని త్వరగా గుర్తించి మందులు వాడుతూ బీపీ, షుగర్ వ్యాధిని నియంత్రణలో పెట్టుకుని ఫిజియోథెరపీ చేయించుకోవాలి. నాలుగో స్టేజీలో జాయింట్ రీప్లేస్‌మెంటు సర్జరీ చేయించుకోవాలి.

● డా.డి.రాజయ్య, ప్రొఫెసర్ ఆఫ్ ఆర్థోపెడిక్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు

రోబోటిక్ పద్ధతిలో ఆపరేషన్లు



ఎముకల్లో గుజ్జు అరుగుదల, థైరాయిడ్, వ్యాయామం చేయకపోవడం, ఒబెసిటీ వల్ల ఆర్థరైటిస్ వస్తుంది. ఎక్కువగా కింద కూర్చోవడం వల్ల అరుగుదల పెరుగుతుంది. మోకాళ్లు ఎక్కువగా అరిగిపోవడం వంటి సమస్యకు ఆధునిక పద్ధతిలో గత 8 నెలల క్రితం రోబోటిక్ పద్ధతిలో మోకాళ్ల ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 100 రోబోటిక్ పద్ధతిలో ఆపరేషన్లు చేశాం. ఇవి కాకుండా ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారికి ఇప్పటి వరకు 10వేల మోకాళ్ల ఆపరేషన్లు చేశాం. ఆర్థరైటిస్ వ్యాధి అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తుంది. మోకాళ్లు బాగా అరిగిపోయిన వారికి, కదలిక తగ్గిన వారికి జాయింట్ రీప్లేస్‌మెంటు సర్జరీ మంచి పరిష్కారం.

● డా.ఎం.విజయకుమార్ రెడ్డి, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, శ్రీచక్ర హాస్పిటల్, కర్నూలు

కుటుంబాన్ని బలిగొన్న గ్యాస్

ఆ దంపతులది రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం. సొంతిల్లు కూడా లేదు. సొంతూరిలోనే వారపాకలో అద్దెకు ఉంటూ వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ కుటుంబాన్ని విధి కూడా చిన్నచూపు చూసింది. గ్యాస్ రూపంలో మృత్యువు ఆ కుటుంబాన్ని కబళించింది. గ్యాస్ లీకేజీ కావడంతో గాయపడ్డ కుటుంబ సభ్యుల్లో.. దంపతులతో పాటు మూడేళ్ల కుమారుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. పెద్ద కుమారుడు కూడా చావుబతుకుల మధ్య కొట్టిమిట్టాడుతున్నాడు. తమలాంటి దుర్భర జీవితం తమ పిల్లలకు రాకూడదని ఆ తల్లిదండ్రులు పెద్ద కుమారుడిని చదివించుకుంటున్నారు. చిన్న కుమారుడిని కూడా బాగా చదివించాలని కలలు కన్నారు. ప్రస్తుతం మహిళ గర్భిణి కూడా. అయితే శిశువు కూడా అమ్మ గర్భంలోనే కన్నుమూసింది. కలలో కూడా ఊహించని ఈ ఘటన ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది.

● కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యుఒడిలోకి..
● లీకేజీ ఘటనలో మొత్తం ముగ్గురి మృతి
● వీరిలో ఓ గర్భిణి కూడా..
● ఎస్.బోయినపల్లిలో విషాదం



సువర్ణ, నాగరాజు (ఫైల్)

మృతి చెందిన చరణ్ (ఫైల్)

వెల్దుర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్యాస్ లీకేజీ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ ముగ్గురు మృతి చెందారు. ఈ విషాద ఘటన మండలంలోని ఎస్.బోయినపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన నాగరాజు (40), సువర్ణ (32) దంపతులు వ్యవసాయ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అనిల్, చరణ్(3) ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 5న అర్ధరాత్రి అద్దెకు ఉంటున్న వారపాకలో నిద్రిస్తున్న సమయంలో గ్యాస్ లీకు కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం నాగరాజు మృతిచెందగా, శనివారం తెల్లవారుజామున చరణ్, సాయంత్రం సువర్ణ మృతి చెందారు. నాగరాజు, చరణ్ అంత్యక్రియలు శనివారం ఎస్.బోయినపల్లిలో నిర్వహించారు. గర్భిణి సువర్ణ అంతిమ సంస్కారాలు ఆదివారం నిర్వహించనున్నారు. అనిల్ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెద్ద కుమారుడు అనిల్ గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



శశికళ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బలవన్మరణానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామీణ పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన శశికళ(30) అదే గ్రామానికి ధనుంజయ్యగౌడ్ ప్రేమించుకున్నారు. వీరిద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లి నిరాకరించారు. ధనుంజయ్యగౌడ్‌కు ఎర్రకోట గ్రామానికి చెందిన ఓ యువతి పెళ్లి చేసుకున్నాడు. శశికళను మంత్రాలయానికి చెందిన ఓ యువకుడితో వివాహం జరిపించారు. కొన్నాళ్లు ఎవరి జీవితాల్లో వారు సంతోషంగా ఉన్నారు. శశికళ నువ్వేకావాలంటూ ప్రియుడు ధనుంజయ్య వద్దకు వచ్చేసింది. విషయం తెలుసుకున్న పెద్దలు శశికళను నచ్చజెప్పి భర్త దగ్గరకు పంపారు. కొన్నాళ్లకు మరోసారి ఆమె ప్రియుడి వద్దకు వచ్చేసింది. గత్యంతరం లేక ప్రియుడు ఆమెను ఓ హాస్టల్‌లో ఉంచాడు. పెళ్లి చేసుకోవాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని వేధించేది. ఈనెల 5వ తేదీన ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు ఫొటోను తీసి ధనుంజయ్యగౌడ్‌కు పంపింది. భయభ్రాంతులకు గురైన అతడు పొలంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సోమవారం అతడి అంత్యక్రియలను గ్రామంలో నిర్వహించారు. ప్రియుడు మృతిచెందడం.. భర్త, పిల్లలు దూరం కావడంతో జీవితంపై విరక్తి చెంది శశికళ సోమవారం పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంలో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృత్యువాత పడింది. శనివారం ఆమె అంత్యక్రియలు గువ్వలదొడ్డిలో నిర్వహించారు. శశికళకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్ కోసమని వస్తే..

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటున్న బంధువులు
● మృతదేహంతో హాస్పిటల్ ఎదుట ఆందోళన
● కార్డియాక్ అరెస్టు అంటున్న వైద్యులు



హాస్పిటల్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హార్ట్ ఆపరేషన్ కోసమని వచ్చిన ఓ వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన నగరంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహించిన బంధువులు మృతదేహంతో హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు. మునగాలపాడుకు చెందిన పెద్ద మాదన్న(56) గుండె సంబంధిత సమస్యతో కల్లూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి ఈ నెల 5న కొత్తబస్టాండు సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ మోషన్ దగ్గర రక్తస్రావం ఉండటంతో మూ డు రోజుల ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. హార్ట్ ఆపరేషన్‌కు ఏర్పాటు చేశారు. శనివారం అంతా సిద్ధంచేసి ఆపరేషన్ వాయిదా వేస్తున్నట్లు ఉదయం 10 గంటలకు వైద్యులు ప్రకటించారు. మధ్యాహ్నం 12 గంటలకు రోగి చనిపోయాడని వైద్యులు తెలిపారు. దీంతో బంధువులు ఆగ్రహానికి గురై శవంతో హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని బైఠాయించారు. చివరకు పోలీసులు రంగ ప్రవేశం చేసి బాధితులతో మాట్లాడి ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై హాస్పిటల్ యాజమాన్యం వివరణ ఇస్తూ రోగికి మోషన్ బ్లీడింగ్ అవుతుంటే మూడు రోజులు ఐసీయూలో ఉంచి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేశామన్నారు. తర్వాత కార్డియాక్ట్ అరెస్టుతో చనిపోయాడని, వైద్యుల నిర్లక్ష్యం లేదంటూ వివరించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ పాల్పడిన రాజారెడ్డి అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఏడాది జనవరిలో వెంకటాద్రి నగర్‌లో తులిశమ్మ అనే మహిళ మెడలో నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి చైన్ స్నాచింగ్ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజారెడ్డిని నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.లక్ష నగదుతో పాటు కొంతమేర బంగారు నగలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థి మృతి

మహానంది, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలకు చెందిన మూడో సంవత్సరం ఏజీ బీఎస్సీ చదువుతున్న జనార్దన్ నాయక్(21) పాలేరు వాగులో ఈతకు వెళ్లి మృతి చెందారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. శనివారం కళాశాలకు సెలవురోజు కావడంతో కళాశాల సమీపంలోని పాలేరువాగు వద్దకు మిగతా విద్యార్థులతో కలిసి దుస్తులు శుభ్ర పరుచుకొనేందుకు వెళ్లారు. అనంతరం వాగులో ఈత కొట్టే క్రమంలో జనార్దన్ నాయక్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. విద్యార్థి స్వస్థలం చిత్తూరు జిల్లా జిల్లెల మండలం పెద్దతండా. శనివారం సాయంత్రం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొన్న తల్లితండ్రులు విగతా జీవిగా పడి ఉన్న కుమారుని మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాలలో గోల్డ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫిరోజ్‌ను సన్మానిస్తున్న యజమానులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల చామకాల్వ సమీపంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో అన్సర్ డైమండ్ అండ్ గోల్డ్ జ్యూవెలరీ ఆధ్వర్యంలో 5వ సారి ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతలో అన్సర్ జ్యూవెలరీ రాజీ పడదని అన్నారు. అన్సర్ జ్యూవెలరీ యజమానలు అన్సర్, అమీర్ మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి లక్షరూపాయల కొనుగోలుపై ఒక వెండి కాయిన్, ప్రతి రూ25 వేల కొనుగోలుపై ఒక్క లక్కీ కారు, బైక్ కూపన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ మహబూబ్ జిలానీ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మల్లెల రాజశేఖర్



హుశేనాపురంలో సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నాయకులు

ఓర్వకల్లు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ప్రభుత్వం రైతులకు 25 శాతం సబ్సిడీతో అందిస్తున్న పప్పుశనగ విత్తనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సబ్సిడీ ద్వారా రైతులకు అనేక పనిముట్లు విత్తనాలు, ట్రాక్టర్లు తదితర పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు సబ్సిడీ శనత విత్తనాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హుశేనాపురం సొసైటీ అధ్యక్షులు సీఎన్ సుధాకర్ రెడ్డి, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి, నాయకులు గొల్ల నాగరాజు, రామగోవిందు, మాజీ ఎంపీటీసీ నాగరాజు, వేణు, బజారు, నాగభూషణం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు



అవార్డు అందుకుంటున్న కళాశాల చైర్మన్ అశోకవర్ధన్ రెడ్డి, సీఈవో డా.హరీష్ కృష్ణ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల డా.ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును దక్కించుకుంది. ఈ నెల 10వ తేదీన ఢిల్లీలో బాలీవుడ్ నటుడు రణదీప్ హుడా, మాజీ ఎంపీ భూషణ్ చరణ్ సింగ్‌చే ఈ అవార్డును అశోకా కళశాల చైర్మన్ అశోక వర్ధన్ రెడ్డి, సీఈవో డా.హరీష్ కృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో అభినందనలో అశోక వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మా విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు ఈ అవార్డును అంకితం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.నవీన్, వైస్ ప్రిన్సిపాల్ మురళికృష్ణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



గూడూరు అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ టీం గూడూరు మండలంలో మునగాల గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రం - 1ని తనిఖీ చేశారు. శనివారం నీతి అయోగ టీం అధికారి మోహన్ ఆధ్వర్యంలో మునగాల గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రం - 1 ఆసిక్మకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీతి అయోగ టీం ఇంటింటికి వెళ్ళి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆహార సరుకులపై లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకొన్నారు. కార్యక్రమంలో నీతి అయోగ టీం వెంట ఐసీడీఎస్ సీడీపీవో వరలక్ష్మీ, సూపర్‌వైజర్ పద్మావతి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి



రైతులకు శనగ అందజేస్తున్న సొసైటీ చైర్మన్

కోడుమూరు రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని లద్దగిరి సొసైటీ చైర్మన్ పట్టి కృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌ఎస్కేలో రైతులకు సబ్సిడీ శనగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సబ్సిడీ వ్యవసాయ పరికరాలు, విత్తనాలు అందిస్తోందని అన్నారు. రైతులు సిబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గుడిసె విజయరాముడు, ఏఈవోలు భారతి, హిమసుందరి, వీఏఏ, వీహెచ్‌ఏలు సురేంద్ర, లింగేశ్వరయ్య పాల్గొన్నారు.

మేధావుల నిలయం సిల్వర్ జూబ్లీ విద్యాలయం

● ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు



మాట్లాడుతున్న వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ విద్యాలయం మేధావుల నిలయమని క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్శిటీ అనుబంధ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. క్లస్టర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మేధావులైన పూర్వ విద్యార్థులతోపాటూ వీసీ ఆచార్య వి. వెంకట బసవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎందరో మేధావులను తయారు చేసిన ఘనత సిల్వర్ జూబ్లీ కళాశాలకు ఉందని అన్నారు. కళాశాల్లో వివిధ శాఖల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షునిగా సీహెచ్ సూర్యప్రకాశ్, కార్యదర్శిగా లీలారాం, కోశాధికారిగా కొండాచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మోదీ సభను సమన్వయంతో విజయవంతం చేద్దాం

● కూటమి పార్టీల నాయకులతో తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 16నమోదీ సభను కూటమి నాయకులు సహకారంతో విజయవంతం చేద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు రామక్రిష్ణ, జనసేన జిల్లా అధ్యక్షులు సురేష్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిలతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి పెద్ద పీట వేసి నిధుల వరద పారిస్తున్నారని, విజనరీ లీడర్ చంద్రబాబు వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానను ఖాళీ చేస్తే అనుభవం, విజన్ రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రధాని మోదీ సభ చరిత్ర సృష్టించబోతోందని, జిల్లాలకు పరిశ్రమలు, ఉద్యోగాలు రాబోతున్నాయని, స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు విస్తృతంగా సాగుతున్నాయని తెలిపారు. బీజేపీ అధ్యక్షులు రామక్రిష్ణ మాట్లాడుతూ మోదీ పర్యటన జిల్లా పర్యటనతో రూపురేఖలు మారబోతున్నాయని, అభివృద్ధి దిశగా నిధులు ప్రకటించి జిల్లా, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తారని తెలిపారు. జనసేన అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ కూటమి పార్టీల సమన్వయంతో మోదీ సభను విజయవంతం చేస్తామని తెలిపారు.

● పేర్నినాని మతిభ్రమించి మాట్లాడొద్దు

వైసీపీ నేత పేర్ని నానీ మతి భ్రమించి సీఐపై దౌర్జన్యం చేయడం ఏంటని గౌడ్ కార్పొరేషన్ చైర్మన్‌గురుమూర్తి ధ్వజమెత్తారు. 378 మెట్రిక్ టన్నుల బియ్యం అమ్మెసుకున్నప్పుడే చర్యలు తీసుకుంటే బాగుండేదని, ప్రస్తుతం హద్దు.. అదుపు లేకుండా మాట్లాడం, బీసీ ఓట్లతో గతంలో 151 సీట్లతో గెలిచి బీసీలకు రిజర్వేషన్ల తగ్గించి మోసం చేసిన నీకు బీసీ బిడ్డ కొల్లు రవీంద్ర పై ప్రతి రోజు ఏదో వివాదం తెరపైకి తెచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలకు తెరలేపారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కాసాని మహేస్‌గౌడ్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సత్రం రామక్రిష్ణ, నాయకులు పుల్లయ్య చౌదరీ, విజయకుమారీ, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల విద్యతోనే ఆర్థిక స్వావలంబన

● కర్నూలు డీఎంహెచ్‌వో



మాట్లాడుతున్న కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సృష్టికి కారణమైన ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి ఆడపిల్లల విద్యతోనే ఆర్థిక స్వాలంబన లభిస్తుందని కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ అన్నారు. నగరంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు డా.సునీల్ కుమారీ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, పాఠశాల హెడ్ మాస్టర్ సలోమి, కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

విజేతలుగా రండి

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 హాకీ బాలుర బాలికల ఎంపిక పోటీలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించారు. శనివారం జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ క్రీడాకారులను పరిచయం చేసుకుని విజేతలుగా తిరిగి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి రాఘవేంద్ర, సెలక్షన్ కమిటీ మెంబర్లు జయకుమార్, అజీజ్, నర్సప్ప, హాకీ సంఘం ఉపాధ్యక్షులు ప్రవీణ్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, ఫిజికల్ డైరెక్టర్ సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ బెన్నమ్మకు గోల్డెన్ నంది అవార్డు



మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న వార్డెన్ బెన్నమ్మ

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్, సౌత్ ఇండియా అవార్డ్స్-2025లో భాగంగా కర్నూలుకు చెందిన సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటు వార్డెన్ బెన్నమ్మ తెలంగాణ మా జీ స్పీకర్ మధుసూదనాచారి, గద్దర్ కుమార్తె వెన్నెలక, ఎమ్మెల్సీ దయాకర్ చేతుల మీదుగా గోల్డెన్ నంది అవార్డును అందుకున్నారు. బెన్నమ్మ వెయ్యికి పైగా కవితలు, ఆరు పుస్తకాలు, పేపర్ ఆర్టికల్స్ సమాజానికి ఉపయోగపడే విధంగా ప్రచురించడం పట్ల ఆమె సేవలను కొనియాడారు.

'ప్రజలకు సేవలు అందించడం వైద్యుడి సామాజిక బాధ్యత'



శిక్షణలో పాల్గొన్న వైద్య విద్యార్థులతో వి.బ్రహ్మారెడ్డి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల పన్నులతో మన డాక్టర్లుగా ఉన్న మన వారికి సేవలందించడం మన సామాజిక బాధ్యత అని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డా.వి.బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని డా.బ్రహ్మారెడ్డి హెర్నియా సెంటర్ మీటింగు హాలులో వైద్య విద్యార్థులు, యువ వైద్యులకు రెండు రోజుల మెడికల్ నాలెడ్జ్ వర్క్‌షాపులో డా.వి.బ్రహ్మారెడ్డి మాట్లాడారు. ప్రజలు కట్టిన పన్నులతో మనం డాక్టర్లు అవుతున్నామని, కొత్త వైద్యులకు సేవా దృక్పథం ఎంతో అవసరమన్నారు. మొదటిరోజు ఆయన వైద్యులు, వైద్య విద్యార్థులకు ఇంజెక్షన్లు ఎలా వేయాలి.. సరైన పద్ధతులను వివరించారు. ప్రథమ చికిత్సలో భాగంగా గాయాలకు కుట్లు, కట్టు కట్టే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మహ్మద్ మియా, డా.బాలకృష్ణ, కంటి వైద్య నిపుణులు డా.స్వాతి, జేవీవీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దామోదర్, శ్రీరాములు, సమాచార కార్యదర్శి మీనా పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కర్నూలు క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్యూడిషియల్ కస్టడిలో ఉండి పరారైన నాగేంద్ర అనే వ్యక్తిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శరీన్‌నగర్‌కు చెందిన నాగేంద్ర ఓ సివిల్ వివాదంలో జ్యూడిషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ నెల 8వ తేదీన కోర్టు హాలులో కోర్టు ఉద్యోగి ప్రభాకర్ తోసేసి పరారయ్యాడు. దీంతో ఆ కోర్టు ఉద్యోగి ప్రభాకర్ పోలీసులకు పిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఏపీయూడబ్లూజేఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీయూడబ్లూజేఎఫ్ నగర కమిటీ సమావేశాన్ని నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి బి.మద్దులేటి, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గోరంట్లప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినా అక్రిడిటేషన్ల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఇంటి స్థలంలోని ప్రతి జర్నలిస్టుకు స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణాన్ని కూడా చేపట్టే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం అక్టోబరు 20వ తేదీ తర్వాత జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.హుశేన్, ఎర్రమల, శివకుమార్, చంద్ర, నర్సిరెడ్డి, మణిబాబు, శ్రీను, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఆక్సిజన్ సిలిండర్ల విరాళం



ఆక్సిజన్ సిలిండర్, రిఫ్రిజిలేటర్‌ను విరాళంగా అందిస్తున్న డాక్టర్ శంకర శర్మ

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకర శర్మ ఆక్సిజన్ సిలిండర్లు, రిఫ్రిజిరేటర్‌ను విరాళంగా అందించారు. శనివారం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళినికి ఆయన అందించారు. ఈ సందర్భంగా శంకర శర్మ మాట్లాడుతూ తాను చదువుకున్న కర్నూలు మెడికల్ కాలేజీకి పేద రోగుల కోసం తన వంతు సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డా.కుమారస్వామిరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ సభ్యులు డా.కేజీ గోవిందరెడ్డి, సర్జికల్ అంకాలజిస్టులు డా.నరేష్, డా.చైతన్య వాణి, ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ డా.రాజారవికుమార్, క్యాన్సర్ వైద్యులు డా.ఉమామహేశ్వరరెడ్డి, డా.శివప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



పెద్దపాడు బాలసదనంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవంలో పాల్గొన్న పీడీ విజయ

కల్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య ప్రభుత్వ బాలసదనంలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ విజయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలికల భద్రత, ఆరోగ్యం, విద్యా సాధికారతకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ బాలమణి, డీసీటీఓ శారద, శిశు గృహ మేనేజర్ మెహతాజ్, పద్మ, విజయకుమారి, ఉమాదేవి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


కల్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల రీ-కేటగిరైజేషన్ ఆమోదించడం పట్ల కల్లూరు మండల పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర కోశాధికారి డి.శేషన్న హర్షం వ్యక్తం చేశారు. శనివారం సంఘం జిల్లా అధ్యక్షుడు శేక్షావలి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అభిషేక్, శివశంకర్, గురుస్వామి, వేణుగోపాల్, శ్రవన్‌కుమార్, రాముడు, మురళి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రి-కేటగిరైజేషన్ ఆమోదించడం పట్ల ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకులు గురుస్వామి హర్షం వ్యక్తం చేశారు. శనివారం పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర కోశాధికారి డి.శేషన్న, కర్నూలు జిల్లా అధ్యక్షులు కే.షేక్షావలి, ప్రధాన కార్యదర్శి అభిషేక్, ట్రెజరర్ శివశంకర్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ గో బ్యాక్'కు సంపూర్ణ మద్దతు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వామపక్షాలు ఈ నెల 15న నిర్వహిస్తున్న మోదీ గో బ్యాక్ ఉద్యమానికి కార్మిక సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఏఐటీయూసీ,సీఐటీయూ,ఎఫ్‌టీయూసీ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, అంజిబాబు మాట్లాడుతూ జీఎస్టీ సంబరాలు నిర్వహించడానికి 16న దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలుకు వస్తున్నారని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించారా అని ప్రశ్నించారు. మూతబడిన పరిశ్రమలు తెరిపించారా..లేదా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేశారా అని అన్నారు. మోదీ గో బ్యాక్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, నియోజకవర్గాలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు టి.రామాంజనేయులు, సురేష్‌నాయక్, నాగేంద్ర, ఉమేష్,అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



బాధితులకు చెక్కులు అంజేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీఠ వేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. శనివారం మాదవీ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు రూ.5,81,720 సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. రమాదేవి-42136, పాపారాయుడు-4,60,505, క్షత్రపతిరెడ్డి-79,079 ఉన్నారు.

మున్సిపల్ డైరెక్టర్‌కు స్వాగతం



మున్సిపల్ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించడానికి కర్నూలు నగరానికి విచ్చేసిన మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు డా.పి.సంపత్‌కుమార్‌ను నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఘనంగా స్వాగతం పలికారు. శనివారం నగరంలోని ఓ హోటల్ వద్ద ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు. ఈ మేరకు ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న అంజిబాబు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ స్కావెంజర్స్‌కు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో యూనియన్ నాయకులు రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కావెంజర్స్‌కు పనిభారం పెరిగిందని, పాఠశాలలో రకరకాల పనులు చేయిస్తున్నారని అన్నారు. వారికి జాబ్ చార్ట్ కూడా లేదన్నారు. జాబ్ చార్ట్ నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వేతనాల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు ఏసు, సువార్తమ్మ, బజారమ్మ, పర్వీన్, ఖాజాబీ, ముబీనా తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుల సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్మిక కర్షక భవన్‌లో ఈ నెల 13న జరిగే ఉల్లి రైతుల సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవడం వైఫల్యమైందని విమర్శించారు. సమావేశంలో జిల్లా సమయ కార్యదర్శి కోటకొండ సూరి, నాయకులు విశ్వనాథ్, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం తన కార్యాలయంలో కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామానికి చెందిన దుంపల నాగేష్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద రూ. 59,879 మంజూరు కాగా బాధితుడికి చెక్కు అందజేశారు. అందజేశారు. రూ. మంజూరయ్యాయని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కాలనీలలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని శనివారం 1వ, 10, 32, 36,43 వార్డులలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, రోడ్లు, కరెంటు పోల్స్ తదితర సమస్యలను సీపీఎం నాయకులకు ప్రజలు వివరించారు. పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని, తక్షణమే జొహరాపురంలో అపరిశుభ్రతను తొలగించి ప్రజలను అనారోగ్యాల భారీ నుంచి కాపాడాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నగేష్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ ఎండి.షరీఫ్, సుధాకరప్ప, నాయకులు అబ్దుల్ దేశాయ్, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి



చలో విజయవాడ విజయవంతం చేయాలన్న జేఏసీ నాయకులు

కల్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 13న విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి కర్నూలు జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జేఏసీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని యూనియన్ల నాయకులు సమన్వయంతో పనిచేసి ఉద్యోగులను విజయవాడకు తీసుకురావాలన్నారు. 14 నుంచి వర్క్ టూ రూల్ పాటించాలని అకౌంట్స్, ఓఅండ్ ఎం స్టాఫ్, ఆపరేటర్లు సిబ్బంది పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శంకర్, నాగశేషులు, రమణమూర్తి, సయ్యద్‌భాషా, సురేష్‌బాబు, దామ్లానాయక్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనీ ఎల్లమ్మ దేవాలయం మాజీ చైర్మన్, టీడీపీ నాయకులు బేతం కృష్ణుడు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీలకు అతీతంగా పోరాటాలు, డిమాండ్లు చేస్తున్నప్పటికీ ఆచరణకు నోచుకోవడం లేదని తెలిపారు. కర్నూలుకు రానున్న ప్రధాని మోదీని కలిసి వాల్మీకుల సమస్యలను వివరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అమెరికాలోని డల్లాస్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్‌లో కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివార జరిగింది. 1984-95 వరకు ఉన్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా రఘునాథ్, శ్రీ నగేష్ రవి కంటి, శ్రీధర్ మంతా ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ శ్రీ విద్య, సెక్రటరీ వేద వ్యాస్, శ్రీనివాసరెడ్డి, డీన్ బ్రహ్మానందరెడ్డిలతో పాటు పూర్వ విద్యార్థులు 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేరుశనగకు మళ్లీ గ్రేడింగ్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ యార్డులో గత నెల నుంచి వేరుశనగ దిగుబడికి గ్రేడింగ్ పద్ధతిని అధికారులు రద్దు చేశారు. రైతులు మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడికి గ్రేడింగ్ చేయకుండా యధావిధిగా కొనుగోలు చేస్తామని వ్యాపారులు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు హామీ ఇచ్చారు. రైతులు ఎంతో ఆనందపడ్డారు. నెల రోజులు వ్యాపారులు కూలీలతో గ్రేడింగ్ చేయకుండా యధావిధిగా రాశిగా పోసిన వేరుశనగ దిగుబడిని టెండర్ వేసి కొనుగోలు చేస్తున్నారు. గ్రేడింగ్ చేయడం వల్ల తాము నష్టపోతున్నామని మట్టి, దుమ్ము, దూళికి ఆరబెట్టుకొని విక్రయానికి చేస్తున్న వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా గ్రేడింగ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు గ్రేడింగ్ చేస్తున్న వ్యాపారులపై నిఘా ఉంచాలని రైతులు కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, సబ్సిడీ కింద ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు వ్యవసాయ పరికరాలు అందిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి రాములవారి దేవాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పప్పుశనగ విత్తనాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు దగాకోరు ప్రభుత్వంతో గత ఐదేళ్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, అబద్దాలతో గద్దెనెక్కితే ఆ అబద్దాలే పాతాలానికి తొక్కుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, వెంకటపతి, మనోహర్ చౌదరి, తిమ్మయ్య చౌదరి, వ్యవసాయాధికారి సురేష్ యాదవ్, తిరుపాల్ నాయుడు, వెంకట్రాముడు చౌదరి, వల్లె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు


మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

ఆదోని, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామంలో వైఎస్సార్సీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదోని టీడీపీ మండల అధ్యక్షుడు శివప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీకి చెందిన సుమారు 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. వైశ్యుల నుంచి చేరిన వారిలో నెంగి తిక్కన్న, తప్పిడి తిక్కన్న, కప్ప బాలరాజు, ఇమ్మానుయేల్, ఎమ్మిగనూరు రాజు, నెంగి బాలరాజు, నెంగి మునిస్వామి, నెంగి బజారి, దస్తగిరి, సుంకప్ప, తప్పిడి ఈరన్న, చిన్న, డేవిడ్, తప్పిడి చిన్న, కప్ప ముని, ఉంకప్ప ముని, నెంగి దేవేంద్ర, నందాస్ ఉన్నారు.

ఈక్రాప్ నమోదుకు గడువు పొడిగింపు

మద్దికెర, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట నమోదుకు ప్రభుత్వం జిల్లా అధికారులు ఈ నెల 25 వరకు గడువు పొడిగించారని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. శనివారం మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు సెప్టెంబరు 30వ తేదీ వరకు మాత్రమే ఉండేదని, అయితే ఈక్రాప్ వంద శాతం పూర్తి కాకపోవడంతో ఈ నెల 25 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీలు ఇతరత్రా అన్నీ పథకాలు అందాలంటే ఈక్రాప్ తప్పనిసరి అని, అందువల్ల ప్రతి రైతు ఈక్రాప్ చేయించుకోవాలన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి


ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మహల్ ఫంక్షన్ హాల్‌లో జరిగే పీడీఎస్‌వో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ తేజ, తిరుమలేష్ కోరారు. శనివారం జిల్లా మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు రాజేష్, వినయ్, పరమేష్, వినోద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మద్దికెర, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మీ పిల్లలకు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ అక్బర్ బాషా అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా స్థానిక ఆదర్శ పాఠశాల వసతి గృహం విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హాస్టల్ వార్డెన్ సుమలత, కృష్ణమ్మ, సూర్యనారాయణ ఉన్నారు.

ఆదోని జిల్లా కోసం కలిసి పోరాడుదాం

పత్తికొండ టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో ఆదోని జిల్లాను ప్రకటించేందుకు కలిసికట్టుగా పోరాడి సాధించుకుందామని ఆదోని జిల్లా సాధన ఐక్య వేదిక కన్వీనర్ నూర్‌అహ్మద్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు తిరుపాల్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు, సీపీఐ నాయకులు కృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు



మహాధర్నాను జయప్రదం చేయాలి

ఆదోని, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న ఛలో విజయవాడ మహాధర్నాను జయప్రదం చేయాలని ఆదోని జేఏసీ కన్వీనర్, ఛైర్మన్‌లు కె.టి.రుద్రప్ప, లక్ష్మన్నలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే తెలంగాణ తరహాలో రెగ్యులర్ చేయాలని, డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలన్నారు. నాయకులు జగ్గయ్యానాయక్, శివ, చిరంజీవి, సుబ్రహ్మణ్యం, చెన్నయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ గృహాలు మంజూరు


చైర్మన్ తాతాబాబుకు రాఘవేంద్ర స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న డైరెక్టర్

ఆదోని రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో గ్రామాల్లో కూడా ప్రభుత్వ గృహాలు మంజూరుకు శ్రీకారం చుట్టామని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరే కల్లు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామకృష్ణతో పాటు డైరెక్టర్లు పా మూరు రామలింగయ్య, పులివెందుల జగన్నాథ్‌రెడ్డి, రాజమండ్రి ప్రియా సౌజన్యలు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ తాతాబాబును విజయవాడ కార్యాలయంలో కలిసి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. త్వరలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడ గృహాల లబ్దిదారులకు హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆదోని టౌన్‌లో 951 నూతనగృహాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.2.5లక్షలు చొప్పున మంజూరు చేసిందన్నారు.









పంచాయతీరాజ్ చట్టంపై హర్షం

తుగ్గలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పంచాయతీ రాజ్ చట్టంతో కార్యదర్శులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పంచాయతీ కార్యదర్శుల డివిజన్ అధ్యక్షులు గోపాల్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంతో ఎన్నో సమస్యలు తీరుతాయన్నారు.

ఉల్లి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఆదోని రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో దొడ్డనగేరిలో ఉల్లిపంట రైతులతో సమావేశమయ్యారు. నష్టపోయిన ఒక్కో రైతుకు ఎకరాకు రూ.50వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని, క్వింటాల్ రూ.2,500 చొప్పున ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేద్దాం

ఆదోని, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన కర్నూలులో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభను విజయవంతం చేసేందుకు ఏపీ కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, తెలుగు రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, భూపాల్‌చౌదరి, మారుతినాయుడు విస్తృత ప్రచారం చేశారు. శనివారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వివరిస్తూ పెద్ద ఎత్తున జన సమీకరణకు చర్యలు చేపట్టారు. మోడీ సభ విజయవంతం కోసం ఏర్పాట్లు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, బూత్ స్థాయిలో సమన్వయంపై చర్చించారు.



జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం

పత్తికొండ. అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణల ద్వారా రైతులకు వ్యవసాయంలో పెట్టుబడుల భారం తగ్గుతుందని మార్కెట్‌యార్డు ఛైర్మన్ నబీసాహెబ్ అన్నారు. పత్తికొండ మార్కెట్‌యార్డు ఆవరణంలో రైతులకు జీఎస్టీ తగ్గింపు వల్ల వ్యవసాయ రంగానికి కలిగేమేలును గురించి మోదీప్రసంగాన్ని టీవీ ద్వారా చూపుతూ అవగాహన కల్పించారు.

పేదలకు భరోసా

హాలహర్వి: కూటమి ప్రభుత్వం జీఎస్టీ పన్ను తగ్గించడం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో భరోసానిచ్చిందని జెడ్పీటీసీ లింగప్ప అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వరలక్ష్మి అధ్యక్షతన జీఎస్టీ ఎక్సిబిషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు జీఎస్టీ పన్ను తగ్గించడం వల్ల ఎలాంటి సరుకులు కొనుగోలులో ఎంత ఆదాయం మిగులుతుందనేది ఆయన ప్రజలకు వివరించారు. డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



శ్రీవారికి ప్రత్యేక పూజలు

కౌతాళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలో వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని ప్రముఖ అంజనేయస్వామి దేవాలయాలలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కౌతాళంలో నూతన నిర్మాణం చేపట్టిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక ఆలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ దేవాలయంకు వచ్చే భక్తులకు ఉత్తర ద్వార నుండే దర్శనం కల్పించేలా ఆలయ సేవా సమితి సభ్యులు చర్యలు చేపట్టారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

నందవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చాలా మేలు జరుగుతుందని ఏపీ బీసీ కో- అపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు డీవీ రాముడు, పార్టీ మండల కన్వీనర్ కాశీంవలీ, ఐ టీడీపీ తాలుకా అధ్యక్షుడు నదికైరవాడి వీరేష్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నాగలదిన్నె, నదికైరవాడి, గ్రామాల్లో పర్యటించి జీఎస్టీపై అవగాహన కల్పించారు. దీంతో నిత్యావసర సరుకులు, ఎలక్ట్రికల్ పరికరాలు, ఇతర సామగ్రి తగ్గాయన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం: టీడీపీ

నందవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఇబ్రహీంపురం చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు డీవీ రాముడు, పార్టీ మండల కన్వీనర్ కాశీంవలీ, ఐ టీడీపీ తాలుకా అధ్యక్షుడు వీరేష్ అన్నారు. శనివారం మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి సురక్షిత తాగునీటి పథకాన్ని వారు ప్రారంభించారు.

'ఉపాధ్యాయుడిపై దాడి అమానుషం'

కోసిగి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిపై దాడి అమానుషమని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ అన్నారు. శనివారం కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోనెగండ్ల మండలం గాజులదిన్నె ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బసవరాజుపై విద్యార్థి తండ్రి దాడి చేయడం అమానుషమన్నారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ నేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని, ఉపాధ్యా యుడిపై విద్యార్థి తండ్రి కాపు కాచి భౌతికంగా దాడి చేయడం సరికాదన్నారు.

'ఆదర్శం.. నారా భువనేశ్వరి'

పెద్దకడబూరు , అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మహిళలకు ఆదర్శమని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరవ రమాకాంతరెడ్డి, తెలుగు మహిళా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ అన్నారు. భువనేశ్వరి 2025 డిస్టింగ్విస్ట్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికై లండన్‌లోని ఇన్‌స్టాఫ్ డైరెక్టర్స్ సంస్థ నుంచి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

ఆటో..ఇటో..!

ఒక ఆటోలో నలుగురు లేదా ఆరుగురు వెళ్లడం సహజం. అలాంటిది పరిమితికి మించి ప్రమాదకర స్థాయిలో ప్రయాణాలు చేస్తున్నారు. నిత్యం కోసిగి నుంచి గ్రామాలకు వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు, విద్యార్థులు అధిక సంఖ్యలో ఆటోల్లో వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీవో అధికారులు, పోలీసులు ఆటోవాళ్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

- కోసిగి, (ఆంధ్రజ్యోతి)


కోసిగిలో ఆటోలో పరిమితికి మించి ప్రయాణం చేస్తున్న కూలీలు

రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన జగన్

- రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు
- 200 బస్సులతో మోదీ సభను విజవంతం చేద్దాం
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

మంత్రాలయం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.10 లక్షల కోట్లు అప్పులపాలు చేశారని రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం ప్రైవేట్ కల్యాణ మంటపంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఐక్యవాల్మీకి పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మన్న, బీజేపీ నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గ విస్తృతసాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాల్వ శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు నెట్టెం వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈనెల 16న కర్నూలులో జరిగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు నియోజకవర్గం నుంచి 200 బస్సులతో సభను విజయవంతం చేస్తామని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. మాలపల్లి- ఎమ్మిగనూరు రూ. 5కోట్లు, మాధవరం - ఎం.తాండ, నదిచాగి- బాపురం రూ.3.60 కోట్లు, కోసిగి-హాల్వి రూ.3కోట్లు, పొదలకుంట- హాల్వి రోడ్డుకు రూ.2.30 కోట్లు, సాతనూరు, అగసనూరు, తుమ్మిగనూరుకు రూ.3కోట్లు మంజూరైనట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాజారెడ్డి, చావిడి వెంకటేష్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, ఎస్‌ఎం గోపాల్‌రెడ్డి, పవన్‌కుమార్, గోపాల్, సింగిల్‌విండో డైరెక్టర్‌లు చాపల నగేష్, డీసీ తిమ్మప్ప, లక్ష్మన్న, సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సేవలో...

రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాఘవేంద్ర రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్, మంత్రాలయం నియోజకవర్గ పరిశీలకులు నెట్టు వెంకటేశ్వర్లు శనివారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

డ్రైఫ్రూట్స్‌తో పీఠాధిపతికి తులాభారం


పీఠాధిపతికి తులాభారం చేస్తున్న రంజిత్ శ్రేయాస్, కుటుంబ సభ్యులు

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులకు బెంగళూరుకు చెందిన రంజిత్ శ్రేయాస్, కుటుంబ సభ్యులు బియ్యం, కందిపప్పు, డ్రైఫ్రూట్స్‌తో తులాభారం చేశారు. శ్రీమఠం ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య తులాభారం చేశారు. తులాభారం చేసిన దాతలకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, సురేష్‌కోణాపూర్, ఐపీ నరసింహస్వామి, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్, ప్రకాశ్ ఆచార్, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి


వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నవోదయ కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు మంచి మనసు ఇవ్వాలని శనివారం విద్యార్థి సంఘాలు అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, కృష్ణ, రఘు, ఆఫ్రీది, శేఖర్ మాట్లాడు తూ పట్టణంలోని నవోదయ కోచింగ్ సెంటర్, ప్రైవేట్ పాఠశాలల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. జిల్లా విద్యా ధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసు కోకపోవడం విడ్డూరం అన్నారు. విద్యార్థుల ప్రాణాలు గాలికి వది లేయడం దారుణమన్నారు. వీటికి అనుమతి ఇచ్చిన ఎంఈఓ - 1పైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్త మవుతు న్నాయన్నారు. ఎంఈఓ-1ను సస్పెండ్ చేసి మౌలిక వసుతులు లేని, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పాఠశాలలు, నవోదయ కోచింగ్ సెంటర్‌లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

డాక్టరేట్ ప్రదానం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సంఘ సేవకుడు, కళాకారుడు అయిన బైలుప్పల షఫీవుల్లాకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా షఫీవుల్లా మాట్లాడుతూ పుదుచ్చేరి, కంబన్ ఆడిటోరియంలో జరిగిన డాక్టరేట్ కార్యక్రమంలో గ్లోబల్ హ్యూమన్ పీస్‌యూనివర్సిటీ వారు వివిధ రంగాలలో, సామాజిక సేవలు, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అనేక మంది నిష్ణాతులైన సేవకులను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎంపీఈవోల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను ఎంపీఈవోల సంఘం నాయకులు కోరారు. శనివారం విజయవాడలో ఆయన్ను ఎంపీఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు, గౌరవ అధ్యక్షుడు నాగర వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ డివిజినల్ అధికారులు సుధాకర్, విజయశేఖర్, ఈశ్వరయ్య, నిరంజన్, అంజన కుమార్, ప్రసాదరావు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం తగదు: గఫూర్


సీపీఎం కార్యాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్

ఎమ్మిగనూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని తేరుబజార్ ప్రాంతంలో సీపీఎం నూతన కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పద్మశాలి కల్యాణ మండపంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎంఏ గఫూర్ మాట్లాడారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోసిగి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శామేల్ డిమాండ్ చేశారు. శనివారం కోసిగిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 13న సోమవారం కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం మంత్రాలయం నియోజకవర్గం నుంచి చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని దళితులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దళిత సంఘాల నాయకులు సాల్మాన్ రాజు, ఎంపీటీసీ రాజు, దేవన్న, రాజు, మారేష్ న్యాయవాది రాము, జయన్న, ప్రకాష్, అయ్యప్ప, జీవన్, బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యమని ఏబీవీపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి సుమన్, డాక్టర్ హేమంత్ అన్నారు. శనివారం కుర్ణి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో స్వామి వివేకానంద, సరస్వతి దేవి చిత్రపటాలకు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని, ఏబీవీపీని వేదికగా చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ దేశభక్తి, జాతీయ పునర్నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పటికప్పుడు ముందుండి పోరాడి సాధిస్తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డులో ఉన్న తిరుమల నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. శనివారం కాలనీ వాసులు ఎమ్మెల్యే ఇంటి దగ్గర కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ వర్షం వస్తే మా కాలనీ స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తుందన్నారు. పదేళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నామని, మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యాలు లేవన్నారు. ప్రతి ఏడాది మున్సిపాలిటీకి వేలకు వేలు పన్నులు చెల్లిస్తున్నామని, అయినా మౌలిక వసతులను మున్సిపల్ అధికారులు కల్పించడం లేదన్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబర్ 11 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన వైద్యం అందిస్తామని డాక్టర్ శిల్ప పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా దేశంలోని కేప్ టౌన్‌లో నిర్వహించిన ఐవీఎఫ్ అంతర్జాతీయ వైద్యుల సదస్సుకు హాజరై స్వదేశానికి తిరిగి వచ్చిన డాక్టర్ శిల్పాను శిల్పా హాస్పిటల్‌లో వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిల్పా మాట్లాడుతూ ఏ ఒక్క గర్భిణి కాని, పిల్లలు కాని మరణించకూడదనేది ఈ సదస్సు ఉద్దేశ్యమన్నారు. అక్కడ తెలుసుకున్న మెళకువలతో గర్భిణులకు అధునిక వైద్యం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఫౌండర్స్ శివశంకర్, శ్రీకాంత్, అన్సర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

పీఎం సభను జయప్రదం చేయాలి : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 16న జరిగే ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆయన స్వగృహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలాలలోని గ్రామాల టీడీపీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లష్టర్ ఇన్‌చార్జీలు, నామినేటేడ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి రూ.2 లక్షలు విరాళం

మంత్రాలయం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన భక్తుడు మంజునాథ్ రూ. 2లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం అందజేసినట్లు వారు వివరించారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ


శ్రీ మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీగా ఉన్న దృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. రెండవ శనివారం, ఆదివారం సెలవుదినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

శ్రీమఠం గెస్టుహౌస్ పేరుతో నకిలీ వెబ్‌సైట్

- మఠం అధికారులకు భక్తుల ఫిర్యాదు

మంత్రాలయం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం గెస్టహౌస్‌ల పేరుతో నకిలీ వెబ్‌సైట్ సృష్టించి సైబర్‌నేరగాళ్లు భక్తులను దోచుకుంటున్నారు. శనివారం మైసూరుకు చెందిన ఎంఎన్ వెంకటేష్, వినయ్ ఐదు రోజుల క్రితం సుజయీంద్ర గెస్ట్‌హౌస్ పేరు మీదుగా ఉన్న వెబ్‌సైట్‌లో 2 గదులకు రూ. 6,510కు స్కాన్‌చేసి డబ్బు చెల్లించారు. అయితే శనివారం మంత్రాలయానికి వచ్చి గెస్ట్‌హౌస్‌లో రూములు తమ పేరుమీదుగా రిజర్వ్ కావపోవడంతో మోసపోయామని తెలుసుకున్న భక్తులుమఠం మేనేజర్ వెంకటేష్‌జోషి, మంత్రాలయం ఎస్ఐ శివాంజల్‌కు ఫిర్యాదు చేశారు. నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టించి భక్తుల సొమ్మును కాజేస్తున్నారని, వీటిపైన వెంటనే చర్యలు తీసుకోవాలని భక్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు.